# జలమండలిలో వన్‌టైం సెటిల్‌మెంట్ అట్టర్ ఫ్లాప్

**రూ.1255కోట్ల లక్ష్యం.. వచ్చింది రూ.110కోట్లే.. బిల్లులపై వెసులుబాటు కల్పించాలని కోరుతున్న వినియోగదారులు**

**హైదరాబాద్, డిసెంబరు 1, (ప్రభాతవార్త)**

దీర్ఘకాలికంగా పేరుకుపోయిన నల్లా బిల్లులను వసూలు చేసేందుకు జలమండలి అందుబాటులోకి తెచ్చిన వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. రెండు నెలలపాటు ప్రభుత్వం అవకాశం ఇవ్వగా.. శనివారంతో ఈ గడువు ముగిసింది. కేవలం దాదాపు లక్షకు పైగా ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోగా, జలమండలి కేవలం రూ.110 కోట్లు మాత్రమే ఆదాయాన్ని సమకూర్చుకున్నది. దీర్ఘకాలికంగా పేరుకుపోయిన నల్లా బిల్లులను వసూలు చేసేందుకు జలమండలి అందుబాటులోకి తెచ్చిన వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. రెండు నెలల పాటు ప్రభుత్వం అవకాశం ఇవ్వగా.. శనివారంతో ఈ గడువు ముగిసింది. కేవలం దాదాపు లక్షకు పైగా ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోగా, జలమండలి కేవలం రూ. 110 కోట్లు మాత్రమే ఆదాయాన్ని సమకూర్చుకున్నది. వాస్తవంగా డొమెస్టిక్, డొమెస్టిక్ స్లమ్, కమర్షియల్, ఇండస్ట్రియల్, ఎంఎస్‌బి, బల్క్, కాలనీలు, ప్రభుత్వ, కేంద్ర రంగ సంస్థలు కలిపి 7.18 లక్షల కనెక్షన్లకు ఓటీఎస్ వర్తింపు కాగా.. వీటి నుంచి రూ. 1961 కోట్ల మేర బకాయిలు రావాల్సి ఉందని జలమండలి అంచనా వేసింది. ఇందులో రూ.705 కోట్ల మేర వడ్డీ మాఫీ కానున్నది. రూ. 1255 కోట్ల మేర బకాయిలు వసూలు చేయడమే లక్ష్యంగా ఓటీఎస్‌ను డివిజన్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టినా ఫలితం కనిపించలేదు. దీనికి కారణాలు లేకపోలేదు. ఓటీఎస్ జీవో వెలువడిన తర్వాతనే జలమండలి విధివిధానాలు రూపొందించి దాదాపు 17 రోజులపాటు సమయం తీసుకున్నది. దీనికి తోడు దసరా, దీపావళి వంటి పండగలు, వివాహ శుభకార్యక్రమాలు వచ్చాయి. 90 రోజుల కార్యాచరణ ప్రణాళికలో ఎక్కువ శాతం సిబ్బంది సమయం కేటాయించారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం కలుస్తోంది. అన్నింటికంటే ముందు అఫిడవిట్, సెల్ఫ్ డిక్లరేషన్‌పై ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయడంలో అధికారులు విఫలమయ్యారు. గతంలో దాదాపు ఓటీఎస్ రూపంలో రూ. 250కోట్లకు పైగా ఉంటే ఈసారి మాత్రం జలమండలి రూ.110కోట్లకే సరిపెట్టుకున్నది. కాగా ఓటీఎస్ సద్వినియోగం చేసుకోని వారి నల్లా కనెక్షన్లను తొలగిస్తామని జలమండలి హెచ్చరికలు జారీ చేస్తుండడంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.అయితే ఈ గడువును మరో నెలపాటు పొడిగించాలని, పేరుకుపోయిన బిల్లులపై మరింత రాయితీలు కల్పించాలని పలువురు వినియోగదారులు కోరుతున్నారు.



# హైదరాబాద్ వార్త







# అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్‌బాబు శ్రీకారం

**సరూర్‌నగర్, డిసెంబరు 1 ప్రభాతవార్త:**

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్, జల్‌పల్లి మున్సిపాలిటీలలో నూతనంగా చేపట్టిన పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ఐటి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు శ్రీకారం చుట్టారు. మహేశ్వరం నియోజకవర్గంలో పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పట్లోళ్ళ సబితాఇంద్రా రెడ్డి, కాంగ్రెస్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి, జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది, టియుఎఫ్‌డిసి రాష్ట్ర చైర్మన్ చల్లా నర్సింహారెడ్డితో పాటు పలువురు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇందులో భాగంగా బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని సుల్తాన్‌పూర్ సమీపంలోనున్న ఆర్‌సిఐ క్రాస్ రోడ్స్ నుండి పహాడీషరీఫ్ బైపాస్ రోడ్డులోని శ్రీశైలం రహదారి వరకు రూ.3.20 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన రోడ్డు విస్తరణ, బిటి రోడ్డు నిర్మాణపు



అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు, సబితా ఇంద్రారెడ్డి

పనులకు శ్రీకారం చుట్టారు. అదేవిధంగా జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో పదిహేనవ ఆర్థిక సంఘం నిధులు రూ.143.00 లక్షలతో నిర్మిస్తున్న అర్బన్ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమాల్లో టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి, బడంగ్‌పేట్ కమిషనర్ పి.సరస్వతి, జల్‌పల్లి కమిషనర్ వెంకటరామ్, పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్, బిఆర్ఎస్, ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేరు సర్కారు... తీరు ప్రైవేటు

**ప్రభుత్వాసుపత్రులలో దొరకని మందులు... రెచ్చిపోతున్న మెడికల్ మాఫియా**

**హైదరాబాద్, డిసెంబరు 1 ప్రభాతవార్త :**

ప్రైవేట్ ఆస్పత్రులలో రోగాలను నయం చేసుకోడానికి పేదలు ఆర్థిక స్తోమతలేక ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తే మందుల మాఫియా వారి రక్తం పీలుస్తోంది. మందుల మాఫియా కారణంగా పేరుకే ప్రభుత్వ ఆస్పత్రులుగా మారాయి. ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యులు రాసే మందులు దొరికేది అంతంత మాత్రమే.రోగాలు నయం చేసుకోవాలంటే ప్రైవేట్‌గా మందుల షాపుల్లో కొనుగోలు చేయాల్సిందే. నగరంలోని ప్రభుత్వం ప్రధాన ఆస్పత్రులైన ఉస్మానియా, గాంధీ, పేట్లబురుజు లాంటి ఆస్పత్రులలో మందుల మాఫియా రాజ్యమేలుతోంది. పేరుకు ప్రభుత్వ ఆసుపత్రులే అయినప్పటికి మందులకు మాత్రం వేల రూపాయలు ఖర్చుపెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందని రోగులు, వారి బంధువులు వాపోతున్నారు. వారాలతరబడి వాడాల్సిన మందులు ప్రభుత్వ ఆసుపత్రులలో రోజులకు కూడా లభించడం లేదు. అదీ పూర్తిస్థాయి మందులు లభించడం లేదు. ఆరేడు రకాల మందులు రాస్తే అందులో రెండు,మూడు రకాలు మాత్రమే లభిస్తుండగా మిగతావి ప్రైవేట్ మెడికల్ షాపులలో కోనుగోలు చేసుకోవాల్సిన పరిస్థితి. అదేమని ప్రశ్నిస్తే మందులు స్టాక్ లేవు అనే సమాధానం. గ్రేటర్ హైదరాబాద్ వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో ఇదే పరిస్థితి నెలకొంది. నగరంలో ప్రధాన దవాఖానలైన పేట్లబురుజు, ఉస్మానియా, గాంధీ, ఎంఎన్‌జేలోనూ రోగులు ఇలాంటి పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ ఆసుపత్రులకు టీజీఎంఎస్ఐడీసీ మందులను సరఫరా చేస్తుంటుంది. కాగా కొన్నిసార్లు అత్యవసర పరిస్థితిలో కొంత శాతం మేరకు ఆసుపత్రి అధికారులు కావాల్సిన మందులను కొనుగోలు చేస్తుంటారు. టీజీఎంఎస్ఐడీసీ(తెలంగాణ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ) సరఫరా చేస్తున్న మందులలో కేవలం బేసిక్ మందులు మాత్రమే ఉంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి.

**ఫ్రీగా అందాల్సినవి కొనాల్సిందే...**

ప్రభుత్వ ఆస్పత్రులలో రోగులకు ఉచితంగా మందులను అందించాల్సి ఉండగా అవసరమైన మందులు అందుబాటులో లేవనే సాకుతో ప్రైవేట్ మందుల షాపులలో కొనుగోలు చేయాల్సిందిగా వైద్యులు సూచిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో దొరకాల్సిన మందులు దొరకకపోగా ప్రైవేట్ మందుల షాపుల్లో పుష్కలంగా లభిస్తాయి. ఉస్మానియా ఆస్పత్రి ప్రాంగణంలో దాదాపు ఐదు మెడికల్ షాపులు, సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి అవుట్ పేషెంట్ విభాగం ఎదురుగా నాలుగైదు ప్రైవేట్ మందుల దుకాణాలు ఉన్నాయి. నిలోఫర్ ఆస్పత్రి ప్రాంగణంలో రెండు మందుల దుకాణాలు ఉన్నాయి.ఇవన్నీ నిత్యం కొనుగోలుదారులతో కిటకిటలాడుతుంటాయి. నెలకు రూ.కోట్లలోనే ప్రైవేట్ మందుల మాఫియా కొనసాగుతోంది. రోగులకు ఉచితంగా అందజేయాల్సిన మందులు పది రకాలు ఉంటే అందులో ఆస్పత్రిలో ఉచితంగా లభించేవి కేవలం రెండు,మూడు రకాలే. మిగిలినవి ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న మందుల దుకాణాల్లో కొనుగోలు చేయాల్సిందే.పైగా వైద్యులు కూడా ఆస్పత్రి ప్రాంగణంలో లభించే మందులు మాత్రమే రాస్తుంటారు. మెడికల్ షావుల యజమానులు కూడా వైద్యులు రాసే మందులను మాత్రమే పెద్ద ఎత్తున స్టాకు తెప్పించుకుంటారు. మెడికల్ మాఫియాలో వైద్యులు భాగస్వాములనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులలో మెడికల్ షాపుల నిర్వహణలో కొందరు వైద్యులకు వాటా ఉన్నట్లు చెప్పకుంటున్నారు. మరి కొంత మంది వైద్యులు మెడికల్ షాపులలో కమీషన్ రూపేణ పర్సెంటేజీ తీసుకుంటున్నట్లు సమాచారం. వైద్యులు మాకేమి సంబంధం లేదని చెబుతున్నప్పటికి మాఫియాతో చేతులు కలిపినట్లు చెప్పుకుంటున్నారు. ప్రభుత్వ అస్పత్రులలో కేవలం బేసిక్ మందులు తప్ప అడ్వాన్స్ ట్రీట్‌మెంట్‌కు అవసరమైన మందులు ఇవ్వాలంటే దొరకని పరిస్థితి. అతి తక్కువ ఖరీదు చేసే మందులు మాత్రమే లభించడం, వేలాది రూపాయాల ఖరీదు చేసేంత మందులు ప్రైవేట్ మెడికల్ షాపులలో కొనాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని డోసులైతే రూ. లక్షల్లో ఉంటుంటాయి. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వ అస్పత్రుల లక్ష్యం ఏంటో అర్థంకాని పరిస్థితి.



ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ కమ్యూనిటీ హాలు వద్ద గుంతలు పూడుస్తున్న దృశ్యం

**'వార్త'కు స్పందన**

## గుంతలు పూడ్చిన జిహెచ్‌ఎంసి అధికారులు

**బేగంపేట డిశంబరు 1, ప్రభాతవార్త :** బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ కమ్యూనిటీ హాలు వద్ద రోడ్డు గుంతల మయంగా మారడంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న విషయంపై, గుంతల మయంగా రోడ్డు, వృద్ధులు, చిన్నారులు, మహిళలకు ఇబ్బందులు,, అనే సమస్యపై డిశంబరు 1న 'ప్రభాతవార్త' హైదరాబాద్ మినీలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన జీహెచ్‌ఎంసీ బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య స్పందించారు. వెంటనే బేగంపేట ఓల్డ్ కస్టమ్స్ బస్తీ కమ్యూనిటీ హాలు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను సిమెంట్ తో ప్యాచ్ వర్క్ చేసి పూడ్పించారు. దీంతో బస్తీ వాసులు సంతోషం వ్యక్తం చేసారు.



# పెరిగిన కోడిగుడ్డు ధర

**డజను గుడ్లు రూ.80..రిటైల్ మార్కెట్లో ఒకటి రూ.7**

**హైదరాబాద్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** కొన్ని నెలలుగా కూరగాయలు ధరలు మండిపోతున్న విషయం తెలిసిందే. కిలో టమాటా ధర రూ.40-45గా కొనసాగుతోంది.మిగతా కూరగాయలు రూ.30-60లుగా ఉన్నాయి. ఇది చాలదన్నట్టు మరోవైపు కోడిగుడ్డు రేటూ రోజురోజుకూ పెరిగిపోతోంది. హోల్ సేల్ మార్కెట్లో ఒక్కో కోడిగుడ్డు ధర రూ.5.90గా ఉండగా.. రిటైల్ మార్కెట్లో దాదాపుగా రూ.7గా పలుకుతోంది. ప్రస్తుతం డజను గుడ్ల ధర రూ.80గా ఉంది. దీంతో కోడిగుడ్డు కొనాలన్నా సామాన్య ప్రజలు ఆలోచించాల్సి వస్తోంది. గత జనవరిలో ఒక్కో కోడిగుడ్డు ధర రూ.7 పలికింది. అయితే ఏప్రిల్ నెలలో రూ.3 తగ్గి.. రూ.4 నుంచి రూ.4.50కి చేరింది. మే నెలలోకాస్త పెరిగి రూ.5 నుంచి రూ.5.50 పలికింది. జూన్, జులై నెలల్లో పెరుగుతూ.. ఆగస్టు వచ్చే సరికి రూ.6 నుంచి రూ.6.50కు చేరుకుంది. ఇటీవలి రోజుల్లో కాస్త తగ్గిన గుడ్డు ధర మళ్లీ పెరిగింది. ఇప్పుడు ఒక్కో కోడిగుడ్డు రూ.7లకు చేరి సామాన్యులకు చుక్కలు చూపి స్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ డజన్ కోడిగుడ్లు రూ.80-84గా పలుకుతోంది. రానున్న రోజుల్లో కోడిగుడ్డు ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు అంటున్నాయి. సాధారణంగా చలికాలంలో గుడ్డు వినియోగం పెరుగుతుంది. అదేప సమయంలో క్రిస్మస్, న్యూ ఇయర్ సందర్భంగా కేకుల తయారీకి పెద్దఎత్తున గుడ్లను వినియోగిస్తుంటారు. దాంతో రేట్లు మరింత పెరిగే అవకాశం ఉంది. మరోవైపు కోళ్ల దాణా రేట్లు, రవాణా ఖర్చులు కూడా గుడ్ల ధరలపై ప్రభావం చూపిస్తున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.



గంజాయి విక్రేతని అరెస్ట్ చేసిన ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

**ఉప్పల్, డిసెంబరు 1 ప్రభాతవార్త :**

ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తెచ్చి ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్న ఒక వ్యక్తిని ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సిఐ బి.ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లికి చెందిన ఆనంద్ నహాక్ బజాజ్ వాహనంపై ఒరిస్సా నుంచి గంజాయి తెచ్చి ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఉప్పల్, మల్లాపూర్‌లో పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా వలపన్ని పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడినుంచి ఒక ద్విచక్ర వాహనంతో పాటు, 1280 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒరిస్సా నుంచి ఎండు గంజాయి తెచ్చి విక్రయిస్తున్నాడని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ బి.ఓంకార్, ఎస్ఐ శ్రీనివాసులు, పి.నరేష్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నకిలీ పత్రాలతో జైలు నుంచి విడుదలైన రిమాండ్ ఖైదీ

**వారంట్లు తనిఖీ చేయగా తేలిన నకిలీ ఉత్తర్వులు భాగోతం**

**హైదరాబాద్, డిసెంబరు 1 ప్రభాతవార్త :** నిందితులు తప్పు చేసి జైళ్లకి వెళ్తుంటారు. జైళ్లో శిక్షలు అనుభవించే నిందితులకు ఎలాంటి సౌకర్యాలు ఉండవు. వారు అక్కడి నుంచి తప్పించుకోవడానికి ఎలాంటి దారులూ ఉండవు. నిత్యం సీసీ ఫుటేజీలతో గట్టి నిఘా ఉంటుంది. అయితే చంచల్‌గూడ జైలులోని ఓ ఖైదీ మాత్రం తెలివిగా తప్పించుకున్నాడు. నకిలీ బెయిల్ పత్రాలు సృష్టించి, పోలీస్ అధికారులను నమ్మించి విడుదలైన ఘటన అందరినీ ఆశ్చర్యపరిచింది. డబీర్‌పురా ఠాణా సీఐ నానునాయక్ కథనం ప్రకారం.. సంతోశ్‌నగర్‌కు చెందిన సుజాత్ అలీఖాన్(27)పై నవంబరు 2న నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు నమోదైంది. అదే రోజు అతడిని అరెస్ట్ చేసి చంచల్‌గూడ జైలుకు తరలించారు. అనంతరం అతడిపై మరో కేసు కూడా పెట్టారు. మొదటి కేసులో రాజేంద్రనగర్ కోర్టు నుంచి బెయిల్ ఉత్తర్వులు వచ్చినట్లు జైలు అధికారులకు ఇచ్చారు. మరో కేసు ఉండటంతో అతడిని విడుదల చేయలేదు. నవంబర్ 26న రెండో కేసులోనూ బెయిల్ మంజూరు కావడంతో అతడిని విడుదల చేశారు. అయితే ఆన్‌లైన్‌లో రావాల్సిన బెయిల్ ఉత్తర్వులు జైలుకు చేరలేదు. వారంట్లు తనిఖీ చేయగా, రెండో బెయిల్ ఉత్తర్వులు నకిలీవని తేలింది.

**నకిలీ బెయిల్ ఉత్తర్వులు :** ఇది ఆ జైలులోని మరో నిందితుడి సహాయంతో జరిగిందని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జైళ్ల శాఖ నిబంధనల ప్రకారం విచారణ ఖైదీలకు ఎలాంటి బాధ్యతలను ఇవ్వకూడదు. జైళ్ల కర్మాగారాల్లోనూ ఎలాంటి పనులు చేయించరు. కానీ చంచల్‌గూడలో ఆ నిబంధనలను తుంగలో తొక్కినట్లు తెలుస్తోంది. ఓ విచారణ ఖైదీకి కీలకమైన బెయిల్ విభాగంలో బాధ్యతలను అప్పగించినట్లు సమాచారం. అతడి సహకారంతోనే సుజాత్ అలీ ఖాన్ బయటపడినట్లు తెలుస్తోంది. డబీర్‌పురా పోలీసులు దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## గుండెపోటుతో బిఆర్‌ఎస్ నేత పడకంటి బ్రహ్మచారి మృతి



**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన టిఆర్ఎస్ నేత పడకండి బ్రహ్మచారి(65) ఆదివారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. ఆయనకి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. గతంలో ఆయన బిజెపి పార్టీలో సుదీర్ఘకాలం పని చేశారు. కేంద్ర మాజీ మంత్రి, బిజెపి సీనియర్ నేత దివంగత ఆలె నరేంద్ర ప్రధాన అనుచరుడిగా ఉంటూ 2002లో టిఎస్ఎస్ తరపున అంబర్‌పేట కార్పొరేటర్‌గా పోటీ చేశారు.బ్రహ్మచారి మృతి పట్ల హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, బిజెపి సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, బిజెపి నేతలు నాగభూషణంచారి, కృష్ణ ముదిరాజ్ టిఆర్ఎస్ నేతలు, సిద్ధార్థ ముదిరాజ్ తదితరులు ఆయన మృతి పట్ల సంతాపం ప్రకటించారు. పడకంటి బ్రహ్మచారి భౌతికయానికి గోల్నాకలోని స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

## లంగర్‌హౌజ్‌లో కారు బీభత్సం

**దంపతులు మృతి, మృతురాలు గర్భవతి**

**హైదరాబాద్, డిసెంబరు 1, ప్రభాతవార్త :** వారికి ఏడాది కిందే వివాహమైంది. భర్త పుట్టిన రోజు కావడంతో తల్లిగారింట్లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం స్కూటర్‌పై వారింటికి పయనమయ్యారు. ఇంతలోనే కారు రూపంలో వారికి మృత్యువు ఎదురైంది. తాగి అడ్డగోలుగా కారు నడుపుతూ దంపతుల మృతికి కారణయ్యాడో దుర్మార్గుడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని లంగర్‌హౌస్‌లో జరిగింది. దినేశ్ గోస్వామి, మోనాఠాగూర్ దంపతులు బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో నివాసం ఉంటున్నారు. శనివారం దినేశ్ పుట్టినరోజు కావడంతో.. భార్యతో కలిసి లంగర్‌హౌజ్‌లోని అత్తగారింటికి వెళ్లాడు. వేడుకలు ముగించుకుని టూవీలర్‌పై నందినగర్‌కు తిరుగు పయణమయ్యారు. ఈక్రమంలో ఎదురుగా వచ్చిన కారు వారి స్కూటర్‌ను ఢీకొట్టింది. అనంతరం ఆటో, మరో బైక్‌నూ ఢీకొంది. ఈ ప్రమాదంలో మోనా, దినేశ్ దంపతులు అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు హాస్పిటల్‌కు తరలించారు. మృతురాలు మోనాఠాగూర్ ప్రస్తుతం గర్భవతి. కారు డ్రైవర్ పవన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడు మద్యం మత్తులో ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూకట్‌పల్లిలో ఘోర ప్రమాదం..

## ఆర్టీసీ బస్సును ఢీకొని నుజ్జు నుజ్జయిన కారు..

**కెపిహెచ్‌బి కాలనీ, డిసెంబరు 1, ప్రభాతవార్త :** హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీకొని కారు నుజ్జు నుజ్జయిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం కూకట్‌పల్లి సమీపంలోని వై జంక్షన్ మెట్రో స్టేషన్ సమీపంలో ఆర్టీసీ బస్సును వెనుక నుండి ఢీకొని కారు నుజ్జు నుజ్జయ్యింది. ఈ ఘటనలో కారులో ఉన్న వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమయంలో భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



ఈశ్వరీబాయికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి గీతారెడ్డి తదితరులు

## ఈశ్వరీబాయి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి : గీతారెడ్డి

**కంటోన్మెంట్, డిసెంబరు 1 ప్రభాతవార్త:** బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి,, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసిన ఈశ్వరీబాయి ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని మాజీ మంత్రిగీతారెడ్డి పిలుపునిచ్చారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకురాలు మాజీ ఎమ్మెల్యే ఈశ్వరీబాయి 106వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లి, సెయింట్ జాన్స్ చర్చి చౌరస్తాలోని ఈశ్వరీబాయి కాంస్య విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు రాష్ట్రాల్లోని బడుగు, బలహీనవర్గాలు మహిళల సంక్షేమం కోసం ఆమె చేసిన త్యాగాలను కొనియాడారు. రెండు పర్యాయాలు చిలుకలగూడ కార్పొరేటర్‌గా, ఎల్లారెడ్డిగూడ నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థిగా రెండు సార్లు పోటీ చేసి విజయం సాధించిందన్నారు. ఆమె చేసిన సేవలు, త్యాగాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జయంతి, వర్ధంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు.ఈ కార్యక్రమంలో ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ డి.రాంచంద్రారెడ్డి, గీతా నర్సింగ్ హోం పరిపాలనధికారి మేఘనారెడ్డి, దళిత సంఘాల నాయకులు బాలక్రిష్ణ, శివకుమార్, దేవదత్తూ, పల్లె నాగేశ్వర్ రావ్, మహేశ్ బాబు, నరిసింహులు, కార్తీకరెడ్డి,సైదులు, ఉమేశ్, నరేందర్ పాల్గొన్నారు.

# ఒడిస్సా నుంచి నగరానికి గంజాయి రవాణా

**చందానగర్‌లో ముగ్గురు నిందితుల అరెస్టు.. రూ.18 లక్షల విలువైన 57 కిలోల గంజాయి స్వాధీనం**

**గచ్చిబౌలి, డిసెంబరు 1 ప్రభాతవార్త**

ఒడిస్సా నుంచి నగరానికి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న ఓ ముఠా నగరంలోని పలువురు గంజాయి విక్రేతలకు విక్రయిస్తున్నారు. అచ్చం సినిమాలో చూపించినట్టు కారుడోరులో గంజాయి ప్యాకెట్లను పెట్టేందుకు ప్రత్యేక క్యాబిన్‌ను ఏర్పాటు చేసి తరలిస్తున్నారు. ఈముఠా కదలికలపై సమాచారం అందుకున్న చందానగర్ పోలీసులు, ఎస్‌ఓటీ పోలీసులు నిందితులను చందానగర్‌లో పట్టుకున్నారు. కారులో గంజాయిని తరలిస్తున్న వ్యక్తితో పాటు కారు ముందు పైలట్ మాదిరిగా ద్విచక్ర వాహనం మీద వెళ్తున్న మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి వారినుంచి 18 లక్షల విలువైన డ్రై గంజాయిని, గంజాయి తరలించేందుకు ఉపయోగించిన కారు , ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఆదివారం మదాపూర్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిసిపి వినీత్ వెల్లడించారు...

హర్యానా రాష్ట్రం దివానీ ప్రాంతానికి చెందిన చమన్ సులభంగా డబ్బు సంపాదించడం కోసం గంజాయి విక్రయించాలని నిర్ణయించాడు. ఇందులో భాగంగా హర్యానా రాష్ట్రానికే చెందిన రాకేష్




గంజాయి రవాణాకు ఉపయోగించిన కారు

అనే వ్యక్తిని సంప్రదించి గంజాయిని సమకూర్చేందుకు మాట్లాడుకున్నాడు.చమన్ పథకంలో భాగంగా రాకేష్ నుంచి గంజాయిని తక్కువధరకు కొనుగోలుచేసి నగరానికి తీసుకువచ్చి, ఎక్కువ ధరకు విక్రయించాలని పథకం వేశాడు. ఇందులో భాగంగా పోలీసుల నుంచి తప్పించుకొని గంజాయిని ఒడిస్సానుంచి నగరానికి తీసుకువచ్చేందుకు మాస్టర్ ప్లాన్ వేశాడు. ఎక్స్‌యువి 300 వాహనం డోర్ల వద్ద ఉండే స్పీకర్లను తొలగించి ప్రత్యేక క్యాబిన్ చేయించాడు. ఈమేరకు ఒడిస్సాలో రాకేష్ వద్ద కొనుగోలు చేసిన గంజాయిని ఈనెల 29వ తేదీన నగరానికి తీసుకువస్తున్నాడు. ఔటర్ రింగురోడ్డు మీదుగా పటాన్ చెరు వద్దకు చేరుకున్న తరువాత స్నేహితులు బోయినపల్లికిచెందిన శివంపేట ఉమాకాంత్, అర్జునసాయి క్రిష్ణలకు ఫోన్ చేశాడు. పటాన్‌చెరు నుంచి ఉమాకాంత్, క్రిష్ణలు ముందు ద్విచక్రవాహనంమీద పైలెట్‌గా వెళ్తుండగా, వెనుక గంజాయి ఉన్న కారుతో నగరంలోకి ప్రవేశించాడు. కాగా ఈ గంజాయి తరలింపుపై సమాచారం అందుకున్న చందానగర్ పోలీసులు, ఎస్‌ఓటీ పోలీసులు నిఘా పెట్టారు. ముందు పైలెట్‌గా ద్విచక్రవాహనం మీద వెళ్తున్న ఇద్దరిని, కారులో గంజాయితో వస్తున్న చమన్‌ను అదుపులోకి తీసుకున్నారు. కారును గాలించగా గంజాయి వాసన రావడంతో డోర్ల కప్పులను తొలగించడంతో భారీ ఎత్తున గంజాయి బయటపడింది. దీంతో చమన్, ఉమాకాంత్, సాయిక్రిష్ణలను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి వద్ద నుంచి 18 లక్షల విలువైన 57 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారణలో రాకేష్ ఒడిస్సా నుంచి గంజాయిని రవాణా చేసి తీసుకువస్తే, నగరంలో విక్రేతలకు ఉమాకాంత్, సాయిక్రిష్ణలు విక్రయించాలని పథకం వేసినట్లు తెలిపారు. దీంతో ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు గంజాయితో పాటు కారు, ద్విచక్రవాహనం సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

